అటవీ ఫలసాయాల సేకరణకు
ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలి

జీసీసీ జీఎం సీతారాంనాయక్

భద్రాచలం, అక్టోబర్ 27 : భద్రాచలం ఏజెన్సీలో ముష్టిగింజల దిగుబడి అధికంగా ఉందని, నవంబర్ నెల ప్రారంభంకానున్న నేపథ్యంలో ఇతర అటవీ ఫలసాయాల దిగుబడి గురించి ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలని జీసీసీ జనరల్ మేనేజర్ సీతారాంనాయక్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో జీసీసీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులకు పలు సూచనలు చేశారు. ముష్టిగింజలను దళారులకు అప్పగించకుండా నేరుగా జీసీసీ కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనులకు గిట్టుబాటు ధర చెల్లించేందుకు సిబ్బందికి సూచనలు చేశారు. సమావేశంలో భద్రాచలం జీసీసీ డీఎం విజయ్‌కుమార్, ఫైనాన్స్ జీసీసీ హైదరాబాద్ పీ సత్యనారాయణ, భద్రాచలం అకౌంటెంట్ దీపాలాల్, తెలంగాణ జీసీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, ఐదు సొసైటీల సిబ్బంది, సేల్స్ మెన్, చిన్నతరహా అటవీ ఉత్పత్తుల కొనుగోలుదారులు పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవోతో జీసీసీ జీఎం భేటీ

భద్రాచలం, అక్టోబర్ 27 : భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్‌ను జీసీసీ జనరల్ మేనేజర్ సీతారాంనాయక్ శుక్రవారం పీవో చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీవోకు అటవీ ఉత్పత్తుల గురించి వివరించారు. గిరిజనులు సేకరించిన ఉత్పత్తులను జీసీసీ ద్వారా కొనుగోలు చేయడం ద్వారా వారికి మేలు జరుగుతుందన్నారు. నిరుద్యోగ గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు జీసీసీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్‌లను ఏర్పాటు చేస్తున్నామని, వారి ఆర్థికాభివృద్ధికి జీసీసీ నిరంతరం కృషి చేస్తుందని వివరించారు. సమావేశంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, జీఈసీ స్పెషల్ ఆఫీసర్ ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్‌కు అటవీ ఉత్పత్తుల గురించి వివరిస్తున్న జీసీసీ జీఎం సీతారాంనాయక్

సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్సీవో, ఏపీవో డేవిడ్‌రాజ్

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ఏపీవో డేవిడ్‌రాజ్

భద్రాచలం, అక్టోబర్ 27 : పదోతరగతి, ఇంటర్ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతోపాటు వారి ఉత్తీర్ణతా శాతం మరింత మెరుగయ్యేలా హెచ్ఎంలు, టీచర్లు, అధ్యాపకులు, ప్రిన్సిపాళ్లు దృష్టి సారించాలని ఏపీవో జనరల్, గురుకులం ఇన్‌చార్జి ఆర్సీవో డేవిడ్‌రాజ్ అన్నారు. శుక్రవారం భద్రాచలం పట్టణంలోని గిరిజన గురుకులాన్ని సందర్శించి, ప్రిన్సిపాల్, అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థులు పాఠశాల, కళాశాలకు వెంటనే వచ్చేలా సంబంధిత హౌస్ మాస్టర్స్ శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సిలబస్‌ను సకాలంలో పూర్తిచేసి మార్చిలో జరుగనున్న పరీక్షలకు సిద్ధం చేయాలని అన్నారు. 100శాతం హాజరు ఉండాలని, చదవని పిల్లలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పోటీ పరీక్షలకు కూడా విద్యార్థులను సిద్ధం చేయాలని, ప్రణాళికాబద్ధంగా బోధించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పిల్లలను తీసుకొని వస్తున్న తల్లిదండ్రులతో మాట్లాడారు. సమావేశంలో గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ మెండెం దేవదాస్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నూతన అటవీ చట్టాన్ని రద్దు చేయాలి

మాజీ ఎంపీ మిడియం బాబూరావు

భద్రాచలం, అక్టోబర్ 27 : గిరిజనుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం నూతన అటవీ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పాత మార్కెట్ వద్ద ఉన్న కుమ్రంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కారం పుల్లయ్య, సున్నం గంగ, సోయం జోగారావు, కుంజా శ్రీను, కొర్సా రవి, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నేడు శబరి స్మృతియాత్ర

భద్రాచలం, అక్టోబర్ 27 : భద్రాచలం సీతారామచంద్రస్వామివారి దేవస్థానంలో శనివారం శబరి స్మృతియాత్ర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈవో ఎల్.రమాదేవి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 7గంటలకు చిత్రకూట మండపం వద్ద ఉన్న వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద పూజలు చేసి అక్కడి నుంచి శబరి చిత్రపటంతో గిరి ప్రదక్షిణ, నగర ప్రదక్షిణ నిర్వహిస్తామన్నారు.

రామయ్యకు సర్వాంగ స్వర్ణ కవచాలంకరణ

భద్రాచలం, అక్టోబర్ 27 : భద్రాచలం దివ్యక్షేత్రంలో శుక్రవారం అంతరాలయంలోని మూలవరులకు బెంగుళూరు భక్తులు రూ.5 కోట్లతో తయారు చేయించి సమర్పించిన సర్వాంగ స్వర్ణ కవచాలను ధరింపజేశారు. ఈ ప్రత్యేక కవచధారణతో సీతారామ, లక్ష్మణమూర్తులు మరింత రమణీయంగా భక్తులకు దర్శనమివ్వడంతో వారు ఉప్పొంగిపోయారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొని వచ్చి నిత్యకల్యాణం జరిపించారు. కల్యాణంలో పాల్గొన్న భక్తులకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

రామయ్యకు నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

క్వారీలను పరిశీలించిన అధికారులు

పాల్వంచ రూరల్, అక్టోబర్ 27 : మండలంలోని తోగ్గూడెంలోని క్వారీలను మైనింగ్ రెవెన్యూ అధికారులు శుక్రవారం పరిశీలించారు. అనుమతి లేకుండా నడుస్తున్న క్వారీలపై ప్రత్యేక దృష్టి సారించారు. క్వారీ యజమానులతో మాట్లాడుతూ అనుమతులు లేకుండా క్వారీలను నిర్వహించరాదని, నిర్వహిస్తే భారీగా జరిమానా విధించి, నిర్వాహకులపై కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తోగ్గూడెం నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న రెండు లారీలను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మైనింగ్ డీఈ జైసింగ్, ఆర్ఐ హతియా పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి

పాల్వంచ, అక్టోబర్ 27 : పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని నవతగాంధీనగర్‌కు చెందిన గుగులోత్ సోనీ(121) వృద్ధురాలు శుక్రవారం మృతిచెందారు. ఈమెకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మనువళ్లు, మనుమరాలు, మునిమనమలు మొత్తం కలిపి 70 మంది సంతానం. తన పనులు తానే చేసుకునేదని, అనారోగ్యం క్షీణించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

సోనీ (ఫైల్)

ఆర్ఎంపీలు పరిమితికి మించి వైద్యం చేయొద్దు

దుమ్ముగూడెం, అక్టోబర్ 27 : ఏజెన్సీ మండలంలో గ్రామీణ వైద్యులు పరిమితికి మించి వైద్యం చేయొద్దని దుమ్ముగూడెం ప్రభుత్వ వైద్యుడు పుల్లారెడ్డి అన్నారు. శుక్రవారం లక్ష్మీనగరంలో ప్రైవేటు ల్యాబ్‌లు, ఆర్ఎంపీల క్లినిక్‌లను తనిఖీ చేశారు. వెంకటేశ్వర ల్యాబ్‌ను పరిశీలించి సరైన పత్రాలు లేకపోవడంతో సోమవారం వరకు పత్రాలు తెచ్చుకోకపోతే ల్యాబ్‌ను సీజ్ చేస్తామని సూచించారు. అనంతరం ఆర్ఎంపీల క్లినిక్‌ల వద్దకు వెళ్లి వారి వద్ద ఉన్న మందులను పరిశీలించగా యాంటీబయాటిక్ ఇంజక్షన్లు, సిలైన్లు బాటిల్స్ ఉన్న వాటిని గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో ఎవరైనా వైద్యం నిమిత్తం ఆర్ఎంపీల వద్దకు వెళ్తే వారికి ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని, అంతేకానీ సొంత వైద్యం చేసి వారి ప్రాణాలను బలిగొనద్దని, అత్యవసరం అయితే పీహెచ్‌సీలు, భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించేలా ఆర్ఎంపీలు వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయన వెంట సూపర్‌వైజర్ సాగర్, హెల్త్ అసిస్టెంట్ గంగాధర్, సిబ్బంది ఉన్నారు.

ఆర్ఎంపీల వద్ద మందులను పరిశీలిస్తున్న వైద్యుడు పుల్లారెడ్డి

అమ్మవారి మండపంలో అన్నదానం

అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

పాల్వంచ, అక్టోబర్ 27 : దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా పాల్వంచలోని శాస్త్రీరోడ్ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఉత్సవ విజయవంతానికి సహకరించిన వారిని కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో వర్తక సంఘం కన్వీనర్ చలువాది ప్రకాశ్, సంపత్ మంత్రి, దోమల ప్రవీణ్, కొండ్లె శ్రీనివాస్, రవీందర్, ఆరెంజ్ మెడికల్ శ్రీనివాస్, చావా సంతోశ్ శ్రీనివాస్, శంకరమ్మ, శ్వేత, మల్లేశ్వరి, వంకధార ఇందిరా, కొప్పుల నాగ, కీర్తన, రెడ్డి, సాంబశివమూర్తి, ఉప్పుశెట్టి రాకేశ్, మంగారావు, జెల్లా సూర్యం, సుజాత, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలి

దుమ్ముగూడెం, అక్టోబర్ 27 : మండలంలోని గ్రామాల్లో పారిశుధ్య చర్యలను ప్రజాప్రతినిధులు ముమ్మరంగా చేపట్టాలని ఎంపీడీవో ముత్యాలరావు అన్నారు. శుక్రవారం తూరు బాక గ్రామంలో డంపింగ్‌యార్డు, వర్మికంపోస్టు ప్రదేశాలను పరిశీలించి తడి, పొడిచెత్త సేకరణ, వర్మికంపోస్టు తయారీ తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని, తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్‌యార్డులో నిల్వచేసి వర్మికంపోస్టును తయారుచేసి పంచాయతీకి ఆదాయాన్ని తీసుకురావాలన్నారు. గ్రామాల్లో దోమలు వ్యాపించకుండా పారిశుధ్య చర్యలను చేపట్టి జ్వరాలు రాకుండా చూడాలన్నారు. ఆయన వెంట సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది ఉన్నారు.

తూరుబాకలో డంపింగ్‌షెడ్, వర్మికంపోస్టును పరిశీలిస్తున్న ఎంపీడీవో ముత్యాలరావు

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

HMDA అప్రూవ్డ్ ప్లాట్లు

★దసరా స్పెషల్ ఆఫర్! 5 గ్రా గోల్డ్ ఫ్రీ HMDA పరిధిలో ఇప్పుడే ఇల్లు కట్టుకొని ఉండటానికి తక్కువ ధరలోనే రెరా అప్రూవ్డ్ ఓపెన్ ప్లాట్స్ బ్యాంక్ లోన్, స్పాట్ రిజి: 8639545438.
NT-320354

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+చ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

★ఒక ప్రముఖ సర్వే సంస్థలో తెలంగాణ ఎలక్షన్ క్యాంపెయిన్ & సర్వే చేయుటకు రాజకీయ అవగాహన కలిగిన వెండార్స్ (500+టీం మెంబర్స్) కావలెను. సంప్ర: 7396856819, 7386886819.
NT-320424-All

PLOT FOR SALE

★Iconic infra: హైదరాబాద్ HMDA & DTCP అప్రూవ్డ్ లేఅవుట్ ప్లాట్లు @ శ్రీశైలం హైవే కొత్తూరు, సాగర్ హైవే బొంగులూరు, యాచారం & విజయవాడ హైవే లలో. ఫోన్: 9154102338.
KMM-NT-320527

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.